# ఎవరు ఫూల్?

వడ్డాది వసుంధరాదేవి

స్టేజ్ మీద కళ్యాణవేదిక కట్టడంవల్ల క్రింద కుర్చీల్లో కూర్చున్నవారికి పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు స్పష్టంగా కనిపిస్తున్నారు. లలిత ఫ్రెండ్స్ మొదటి వరసలో ఎడమవైపు కూర్చున్నారు. వేదిక దగ్గరగా వుంది. పెళ్ళికూతురు లలిత కళ్యాణశోభతో ముచ్చటగా వుంది. పెళ్ళికి లలిత క్లాస్‌మేట్స్ కాకుండా, పెళ్ళికొడుకు మోహన్ ఫ్రెండ్స్ కూడా చాలామందే వచ్చారు. వాళ్ళు సరిగ్గా లలిత ఫ్రెండ్స్‌కి వెనక వరసలో కూర్చుని మధ్య మధ్య కామెంట్స్ విసురుతూ హుషారుగా ఆనందిస్తున్నారు. లలిత ఫ్రెండ్స్ రాధ, గీత, వీణ, కమల, స్వాతి పట్టుచీరెలు సవరించుకుంటూ పెళ్ళి తతంగాన్ని కుతూహలంగా చూస్తున్నారు.

తెల్లగా, నాజూగ్గా వున్న గీతని చూసి మూర్తి వధూవరులని ఉద్దేశించి అన్నట్టుగా.

"అబ్బ! నాక్కూడా పెళ్ళి చేసుకోవాలని వుందిరా!" అన్నాడు.

రవి అందుకుని "పిల్ల కనిపించిందా?" కొంటెగా అన్నాడు.

"ఎదురుగుండా . నువ్వూ చూడరా?"

గీతకి ఒళ్ళుమండి రాధతో,

"ఆ మొహాన్ని పెళ్ళి చేసుకునే దెవరే?" అంది.

మోహన్ ఫ్రెండ్స్‌కీ, ముఖ్యంగా మూర్తికీ చురక బాగా తగిలింది. వాళ్ళు రెచ్చిపోయారు.

"ఎర్రతేలులా వుంది. కట్నం ఇస్తుందంటావా?" మూర్తి సందేహంగా అన్నాడు.

"మరే! మా నాన్న సంపాయించిన మూటలున్నాయిగా? అప్పడాల కర్రతో కట్నం రోజూ వీపుమీద యిస్తే సరి!" అంది గీత.

కళ్యాణవేదికమీద ఫొటోగ్రాఫర్ రఘు ఫ్లాష్ కెమెరాతో వధూవరులని మంచి ఏంగిల్స్‌లో, ఒక్కొక్క దృశ్యానికి జీలకర్ర బెల్లం పెట్టేటప్పుడు, అగ్నిచుట్టూ వధూవరులు ప్రదక్షిణం చేస్తున్నప్పుడు స్నాప్స్ తీస్తున్నాడు. అతను మోహన్ మూర్తిల బ్యాచ్‌లోవాడే! మూర్తి గట్టిగా ఈలేసి రఘు దృష్టి తనవైపు తిప్పుకుని,

"నాలుగు స్నాప్స్ యిటు లాగరా! బాగా వస్తే, నా మొహాన్ని ఏ మొహమైనా పెళ్ళి చేసుకుంటుందేమో చూస్తాను" అని కొంచెం కుర్చీ ప్రక్కగా వాలి సరిగ్గా తన ముందునున్న గీత భుజంమీదుగా తన ఫేస్ కనిపించేలా మొహం పెట్టాడు. చప్పున ఫ్లాష్ వెలిగింది. గీత కళ్ళు చిట్లించింది.

"వెల్‌డన్ గురో!" అని అరిచాడు

మూర్తి. ఆ ఫొటో గాని వస్తే గీత భుజం మీద మూర్తి మొహం వాల్చినట్టు వస్తుంది!

గీతకీ రాధకీ వెనకాల వాళ్ళ నవ్వులు, గోల, అల్లరి కంపరం పుట్టిస్తున్నాయి.

గీత రఘువైపు మింగేసేలా చురచుర చూసింది! అతను ఒక్కక్షణం తెల్లబోయినట్టుగా చూసినా, భుజాలెగరేసి కెమెరా ముందువరసవైపు తిప్పాడు. ఫ్లాష్ వెలిగింది. రఘు తమనే తీస్తున్నాడు. ఎంత ధైర్యం అతనికి? తియ్యనీ! డబ్బు ఖర్చు లేకుండా తమకి ఫొటోలు వస్తాయి. గీతకి ఫొటోలు తీయించుకోవడమంటే ప్రాణం! లలిత నడిగి చూడాలి. ఫ్లాష్ కెమేరాతో తీశాడు. తనది ఫొటోజెనిక్ ఫేస్! చాలా బాగా పడి వుండాలి. ఎలా వచ్చాయో ఏమో? అయినా ఆ ఫొటోగ్రాఫర్ ఏం చేశాడని తను కోపంగా చూసింది? రఘు మళ్ళా కెమేరా తమవైపు పెట్టి చూస్తున్నాడు. అతని కళ్లు కొంటెగా తననే చూస్తున్నట్టు అనిపించింది గీతకి. చప్పున జుట్టు సవరించుకుని జడ ముందుకు లాక్కుంటూండగానే ఫ్లాష్ వెలిగింది.

"పూర్తిగా జడ ముందుకి వేసుకున్నాకా తీయకూడదూ? ఇదెలా వచ్చిందో?సత్యభామలాగా పడివుంటుంది. ఈసారి సరిగ్గా కూర్చోవాలి ." గీత సర్దుకుంటూండగానే మరో ఫ్లాష్!

ఛీ! అంతా చూస్తే ఏమనుకుంటారు! పెళ్ళి ఫోటోలు తీయకుండా అన్నీ తననే తీస్తున్నాడేమిటి? గీత ఆశ్చర్యంగా, ముంగురులు సర్దుకుని క్రింది పెదవి పై పంటితో నొక్కి పెట్టి చూస్తూండగా ఇంకో ఫ్లాష్!

గీతకి పెళ్ళిళ్ళు చూడడం ఇష్టంలేదు. కానీ లలిత పెళ్ళి చాలా హుషారు నిచ్చింది ఆమెకి. పెళ్ళి ఫొటోల్లో మూడొంతులు తనవే వస్తాయి. అంతా ఆశ్చర్యపోతారు. మరి తన సౌందర్యం అంతటిది! గీత గులాబీ పెదవులపై చిరునవ్వుని రఘు కెమెరా మళ్లా బంధించుకుంది! గీత గర్వంగా నవ్వు లొలికిస్తూ చూస్తూంది. ఈ ఫొటోగ్రాఫర్ ఉత్త ఫూల్‌లాగున్నాడు. అందమైన ఆడపిల్లలంటే ఎంత మోజు వుంటే మాత్రం, ఇలా ముఖ్యమైన కార్యక్రమాల్లో కూడా అలా ప్రవర్తిస్తే ఎలాగా? ఫొటోలు వచ్చాక అందరూ అతన్నే తిడతారు!

*　　　*　　　*

లలిత మూడు నిద్రలకి అత్తవారింటికి వెళ్ళింది. లలిత లేకపోయినా సరే, ఫొటోలు చూడాలనే ఆత్రుతని ఆణుచుకోలేక గీత ఆ సాయంత్రం అందంగా ముస్తాబై లలిత ఇంటికి వెళ్ళింది. లలిత ఇంట్లో అడుగుపెడుతూనే ఆమె కాళ్ళు వణికాయి. కారణం వరండాలో మూర్తి, లలిత అన్న శేఖర్ గోలగోలగా ఫొటోలు చూస్తున్నారు. ముందుగా గీతని చూసినవాడు మూర్తే! ఈ గోలని నవ్వుతూ చూస్తూ టీ త్రాగుతున్నాడు రఘు. మూర్తి గీతని చూస్తూనే ఫ్రెండ్స్‌తో ఆమెకి వినిపించేలా,

"లవ్‌లీ! నా ఫొటో వండర్‌ఫుల్‌గా తీశావురా రఘూ! ఏ అమ్మాయైనా చూస్తే వెంటపడుతుందేమో భయంగా వుంది"

వాన ˘చ్చ వరదలాాయి!




కొంటెగా అన్నాడు

గీత నిర్లక్ష్యంగా వాళ్ళవంకే చూడనట్టు శేఖర్ దగ్గరకు వెళ్ళింది.

"ఇవిగో గీతా! మా చెల్లాయి పెళ్ళి ఫొటోలు" అని గీత చేతికి ఫొటోల ˘ ˘చ్చిన శేఖర్ పనివాడితో "ఇంకో టీ పట్రా" అన్నాడు.

ఎప్పటివరకూ ఫొటోలు చూస్తున్న ˘ర్తి శేఖర్ ఆమెకి ఇమ్మనగానే తన ˘టో పైనపెట్టి ఆమె వేళ్ళు తగిలేలా ˘ందించాడు పైనున్న ఫొటోలు సగం క్రిందపెట్టి మిగిలిన సగం చూడసాగింది గీత. మూర్తి కనుబొమ ఎగరేశాడు. ఫొటోలన్నీ నునుసిగ్గులతో నున్న లలిత, చిరునవ్వు లొలికిస్తున్న మోహన్! రకరకాల భంగిమల్లో, అన్ని ఫొటోల్లో. ఒకటి మాత్రం మూర్తి బృందానిది. మూర్తి తమాషాగా కళ్ళు చికిలిస్తున్న కొంటె ఫొటో! గీత రపీమని ఫొటోలు బల్ల మీద పెట్టి,

"శేఖర్! మాకు తీసినవి ఏవీ?" అంది.

"మీకు ఎవరు తీశారు?"

"తీయలేదా?" గీత తెల్లబోయింది.

రఘు టీ కప్పు క్రింద పెడుతూ,

"మీరుగానీ, మీ ఫ్రెండ్స్‌గానీ నన్ను తీయమని అడగలేదుగా? మా మూర్తి అడిగాడని ఒకటి తీశాను" అన్నాడు

గీత మొహం అవమానంతో పాలిపోయింది. రఘు తను తీసిన ఫొటోల వైపు గర్వంగా చూస్తున్నాడు. ***